కాకినాడలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

కాకినాడ, నవంబర్ 26 (వాయిస్ టుడే ప్రతినిధి) కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా,కార్మిక, రైతు, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు నవంబర్ 26 న దేశవ్యాప్త నిరసన ఉద్యమానికి పిలుపునిచ్చాయి. ఆ పిలుపులో భాగంగా కాకినాడ జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా, బహిరంగ సభ మంగళవారం జరిగాయి.

ఈ ధర్నా బహిరంగ సభలలో సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్టియు, ఐ ఎన్ టి యు సి, ఏ ఐ ఎఫ్ టి యు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత రైతు కూలీ సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, ఆశ, మిడ్ డే మీల్, అంగన్వాడి, క్లాప్ డ్రైవర్స్, వాలంటీర్లు, నైట్ వాచ్మెన్ లు, టాయిలెట్ వర్కర్స్, మున్సిపల్ వర్కర్స్, హాస్పిటల్ వర్కర్స్ తదితర సంఘాల శ్రేణులు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సిఐటియు నుంచి జి బేబీ రాణి, శేష బాబ్జి, చెక్కల రాజ్ కుమార్ ఐఎఫ్టియు నుంచి జె వెంకటేశ్వర్లు, ఎం ఏసు, గుబ్బల ఆదినారాయణ, రాగుల రఘువులు ఏఐటియుసి నుంచి తోకల ప్రసాద్, సత్యనారాయణ, బోడకొండ ఐఎన్టీయూసి నుంచి తాళ్లూరు రాజు, రైతు సంఘాలు, రైతు కూలీ సంఘాలు నుంచి తిరుమల శెట్టి నాగేశ్వరరావు, పప్పు ఆదినారాయణ, ఎం రాజశేఖర్, టేకుమూడీ ఈశ్వరరావు, వి రాజబాబు, వి చిట్టిబాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడీ అధికారానికి వచ్చిన తర్వాత ప్రజలపై ధరల భారం, పన్నుల భారం పెరిగిందని, ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయని విమర్శించారు. చౌకీదార్ను అన్న మోడీ అంబానీ, ఆదానీలకు, పెద్ద పెట్టుబడిదారులకు చౌకీదారిగా ఉన్నారని విమర్శించారు. దేశ ప్రజల ను లూటీ చేస్తూ పెద్ద పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నాడని విమర్శించారు. మోడీ పాలనలో దేశం అధోగతి పాలు పట్టిందని, రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామిక విలువలను, లౌకిక విలువలను నాశనం చేస్తున్నారని, మత విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. మోడీ దుష్టపాలన నుండి ప్రజలు తమను తాము కాపాడుకోవాలని అందుకు పోరాటాలే శరణ్యమని పిలుపునిచ్చారు. వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని నాశనం చేస్తూ, ప్రైవేట్ యాజమాన్యాలకు అవకాశాలు కల్పిస్తూ కార్మిక హక్కుల్ని కాలరాస్తున్నారని విమర్శించారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాల రద్దు కోసం సాగిన రైతాంగ పోరాట స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల కోసం పోరాడాలని నేతలు పిలుపునిచ్చారు.

దేశ్ కా ప్రకృతి పరిరక్షణ అభియాన్ యాప్ ప్రారంభం: కలెక్టర్ పి. ప్రశాంతి

రాజమహేంద్రవరం, నవంబర్ 26 (వాయిస్ టుడే ప్రతినిధి) ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిరక్షణా చర్యల్లో భాగంగా వైద్య సేవలు అందించే లక్ష్యంగా ఆయుష్ విభాగం ద్వారా " దేశ్ కా ప్రకృతి పరిరక్షణ అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. దేశ్ కా ప్రకృతి పరిరక్షణ అభియాన్ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ'దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ అభియాన్' యాప్, ప్రతి వ్యక్తి శరీర ధార్మిక స్వభావాన్ని వేయడంలో సహాయపడుతుందన్నారు. ఆరోగ్యాన్ని ఆయుర్వేదం పద్ధతుల్లో నిర్వహించడం, ఆయా వ్యక్తులకు అనుగుణంగా ఆరోగ్య సూచనలు, ఆహార నియమాలు, అనుకూల మార్గదర్శకాలను అందించడం ఈ యాప్ ముఖ్య లక్ష్యంగా ఉందన్నారు. జిల్లా ఆయుష అధికారి డాక్టర్. కే సిహెచ్. రమేష్ మాట్లాడుతూ దేశవ్యాప్త దేశ్ కా ప్రకృతి పరిరక్షణ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికి వైద్య సేవలు అందించే లక్ష్యంగా ఆయుష్ విభాగం ద్వారా దేశ్ కా ప్రకృతి పరిరక్షణ అభియాన్ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించినట్లు చెప్పారు.

రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేసిన కాకినాడ ప్రజాసంఘాల నాయకులు

కాకినాడ, నవంబర్ 26 (వాయిస్ టుడే ప్రతినిధి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కాకినాడ ఇంద్రపాలెం సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తూర్పు పశ్చిమ గోదావరి గ్రాడ్యుయేట్ ఎంఎల్సీ అభ్యర్థి హాసన్ షరీఫ్, ఐతాబత్తుల రామేశ్వర రావు, ఏనుగుపల్లి కృష్ణ, కాశీ బాలయ్య, డాక్టర్ బాబ్జీ, తుమ్మల నూకరాజు కాకిలేటి రవీంద్ర, పలివెల వీరబాబు,నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పీఠికను ప్రతిజ్ఞ చేసిన అనంతరం హసన్ షరీఫ్ మాట్లాడుతూ రాజ్యంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు, నేటి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు, కేంద్రంలో మోదీ రాష్ట్రం లో బాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు, రాజ్యాంగం ప్రకారం పాలన చేయకుండా రెడ్ బుక్ ను రాజ్యంగంగా అమలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంది అలా ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టులు చేయడం రాజ్యంగ హక్కులను కాలరాయడమే అని మండిపడ్డారు.

ఆధునిక సాంకేతికతతో నేర నియంత్రణ

జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్..

డ్రోన్ల సహాయంతో జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా..

రాజమండ్రి, నవంబర్ 26 వాయిస్ టుడే ప్రతినిధి: జిల్లాలో నేర నియంత్రణకు సాంకేతికను ఉపయోగిస్తామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నర్సింహా కిషోర్ పేర్కొన్నారు. గోదావరి నది లంక పరివాహక ప్రాంతాలలో ప్రత్యేక టీముల ద్వారా దాడులు నిర్వహించి 12000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు. లంక గ్రామాల్లో డ్రోన్ కెమెరాల సహాయంతో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలోనే నాటు సారా స్థావరాలను గుర్తించి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నాటు సారా తయారీ స్థావరాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, కోడి పందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం దాడులు నిర్వహిస్తామని ఎస్పీ హెచ్చరించారు. ఇదిలా ఉండగా జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, నార్త్ జోన్ ఇంచార్జ్ డి.ఎస్. పి జి. దేవకుమార్ పర్యవేక్షణలో, కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.సత్య కిషోర్, సీతానగరం సబ్ ఇన్స్పెక్టర్ డి. రామ్ కుమార్ మరియు సీతానగరం పోలీస్ స్టేషన్ సిబ్బంది ప్రత్యేక టీంలుగా ఏర్పడి, సీతానగరం మండలం ములకల లంక గ్రామ డ్రోన్ కెమెరాలు ఉపయోగించి నాటు సారా తయారీ స్థావరాలను గుర్తించి, సుమారు 12000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

పురపాలక సంఘం కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం

రామకృష్ణాపూర్ నవంబర్ 26 (వాయిస్ టుడే): క్యాతనపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ, కమిషనర్ గద్దె రాజు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్లెడ్జి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ గద్దె రాజు మాట్లాడుతూ రాజ్యాంగం యొక్క మౌలిక స్వరూపం, ప్రాముఖ్యత భారతదేశ పౌరులందరూ విధిగా పాటిస్తూ దేశం యొక్క సమగ్రతను పెంపొందించాలనిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, మేనేజర్ డి.స్వామి, రెవిన్యూ ఆఫీసర్ కె.సతీష్ , సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతమైన ఉచిత కంటి వైద్య శిబిరం

మక్తల్ నవంబర్ 26 వాయిస్ టుడే ప్రతినిధి: లయన్స్ క్లబ్ సేవా భవనం నందు లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రి సౌజన్యంతో లయన్స్ క్లబ్ మక్తల్ బీమా ఆధ్వర్యంలో, లయన్ డీవీ చారి అధ్యక్షతన లయన్ అనుగొండ శ్రీనివాసులు విజన్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ సహకారంతో మెగా కంటి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. దాదాపు 50మంది వరకు కంటి చికిత్స కోసం హాజరు కాగా, పరీక్షించి కంటి శస్త్రచికిత్స అవసరం ఉన్న 36 మందిని ఆపరేషన్ కోసం పాలమూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఉచిత కంటి వైద్య శిబిరం ఉంటుందని, మఖ్తల్ ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి అంజన్ ప్రసాద్, సభ్యులు రమేశ్ రావు, నాగరాజు, అంబాదాస్ రావు, మఠం వాదిరాజ్, మామిళ్ల పృథ్వీరాజ్, కంటి వైద్య నిపుణులు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమరసత అధ్యర్యంలో రాజ్యాంగ దినోత్సవము

చేవెళ్ల..నవంబర్ 26(వాయిస్ టుడే)రాజ్యాంగ దినోత్సవం శ్రీ సరస్వతి శిశు మందిర్ లో నిర్వహించడం జరిగింది. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శంకర్ పల్లి లో చదివిన విద్యార్థులకు ఇటీవల జరిగిన కానిస్టేబుల్ పోటీ పరీక్షలలో కానిస్టేబుల్ గా సెలెక్ట్ అయిన అరవింద్ మరియు వెంకట్ లు కానిస్టేబుల్ ట్రైనింగ్ పూర్తి చేసుకొని నవంబర్ 30న తన ఉద్యోగంలో చేరబోతున్న వారికి సన్మానించడం జరిగింది. వక్త దామోదర్ రెడ్డి సామాజిక సమరసత్ సహవిభాగ్ కన్వీనర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అంటే దేశ పరిపాలనకు సంబంధించిన నియమాలు సూత్రాలు సమాహారం కాదు. స్వేచ్ఛ సమానత్వం సోదర భావాలు మూల స్తంభాలుగా దేశ ప్రజలు సర్వతో ముఖాభివృద్ధిని కాంక్షించే సమ్మున్నత ఆశయం 75 యేళ్ల సామాజిక ఆర్థిక లింగ భేదాలకు అతీతంగా దేశ ప్రజలందరి జీవితాలని ప్రభావితం చేస్తూనే ఉంది ఇది మన రాజ్యాంగం .కూటికి లేనివారు కుబేరులు ఒకే వరుసలో నిల్చొని ఓటు వేస్తున్నారన్న ఇష్టం వచ్చిన మతాన్ని అనుసరిస్తున్నామన్న స్వేచ్ఛగా మాట్లాడగలుగుతున్నామన్న వివక్ష లేకుండా చదువుకోగలుగుతున్నామన్న అంటే మెరుగైన జీవనం మన జన్మ హక్కుగా మరిందన్నా ఇది మన రాజ్యాంగం పుణ్యమే.ప్రపంచంలో ఎక్కడ లేనని భాషలు సాంప్రదాయాలు విభిన్న మతాలు వేల కులాలు మనదేశం లో ఉన్నాయి. రాజ్యాంగం ఎంత గొప్పగా ఉన్నా దాని అమలు చేసే వ్యక్తి చెడ్డవాడైతే అది కూడా చెడ్డగా మారుతుంది. ఆచరణ పెట్టేవారు మంచివారైతే అది మంచిగా ఉంటుంది స్వయంగా అంబేద్కర్ చెప్పారు.దేశం ముఖ్యమా నమ్మిన మత విశ్వాసాలు సిద్ధాంతాల ముఖ్యమా అన్న విషయాన్ని భారతీయులు తేల్చుకోవాలి దాన్ని బట్టే దేశ భవిష్యత ఆధారపడి ఉంటుంది. రాజకీయ పార్టీలు దేశం కంటే తమ సిద్ధాంతాలకు ప్రాధాన్యతమిస్తే మాత్రం మళ్లీ మనం స్వాతంత్ర్యాన్ని కోల్పోవడం ఖాయం అలా జరగనివ్వదు, దేశం కోసం చివరి రక్తపు బొట్టు కూడా దారపోవడానికి సిద్ధంగా ఉండండి.కార్యక్రమంలో బచ్చు రాముమోహన్, నర్సింహులు, అనిశెట్టి సురేష్ ,శ్రీపాల్ రెడ్డి, శేఖర్ ,అరవింద్ ,శ్రీను,సంగమేష్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరీష మరియు ఉపాధ్యాయురాలు విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ మద్ది అంజన్న సేవలో భక్తులు

మంగళవారం కావడంతో ఆలయానికి పోటెత్తిన భక్తులు..

ఆలయానికిఒక్కరోజు ఆదాయం7.30 లక్షలు..

దేవస్థానం కార్యనిర్వాహణాధికారిణి ఆర్.వి చందన

జంగారెడ్డిగూడెం, నవంబర్ 26(వాయిస్ టుడే ప్రతినిధి): జంగారెడ్డిగూడెం మండలం,గురవాయిగూడెం గ్రామంలో స్వయంభువులై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద కార్తీకమాసోత్సవాలు అత్యంత వైభవముగా నిర్వహిస్తున్నారు. మంగళవారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో దేవస్థానం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈరోజు శ్రీ స్వామి వారి దర్శనార్థం పోలవరం శాసన సభ సభ్యులు చిర్రి బాలరాజు విచ్చేసి శ్రీ స్వామి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం వారిని ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్ వి చందన శ్రీ స్వామి వారి శేష వస్త్రములతో సత్కరించి, చిత్రపటాన్ని బహుకరించగా, ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం గావించి తీర్థ ప్రసాదములు అందజేశారు.కార్తీకమాసం, ఆఖరి మంగళవారం కావడంతో వేకువఝాము నుండి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి, దీపారాదనలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 4.00 గంట లకు తీర్థపు బిందె, ప్రాతః కాలార్చన, తోమాలసేవ అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు స్వామివారికి ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తర పూజలు నిర్వహించారు, శ్రీస్వామి వారి ఆలయం చుట్టూ 108 ప్రదక్షణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు, భక్తులు అన్నప్రాసనలు, వాహన పూజలను జరిపించుకున్నారు. మద్యాహ్నం వరకు దేవస్థానమునకు వివిధ సేవల రూపేణ 7,30,906 రూపాయలు సమకూరినట్లు కార్యనిర్వహణాధికారిణి ఆర్ వి చందన తెలిపారు. చక్రదేవరపల్లి గ్రామస్తులు స్వామి వారి నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయం వద్ద భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయం వద్ద అగ్నిమాపక, పోలీసు శాఖ మరియు బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది సేవలు అందించారు. శ్రీస్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి, సహాయ కమిషనర్ ఆర్.వి. చందన తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనను ఓర్వలేక కేటీఆర్ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: మా సీఎం రేవంత్ రెడ్డి అన్నట్లు కేటీఆర్ కు మైండ్ దొబ్బింది.. కేటీఆర్ కు మైండ్ ఉందా లేక అందులో పెండ ఉందో అర్థం కావడం లేదు..సైకో రామ్ తన శాడిజాన్ని చూపిస్తున్నాడు..కేటీఆర్ మైండ్ అంతా సీఎం రేవంత్ రెడ్డి పై అక్కసు, ద్వేషం, పగ తో నిండిపోయి పనిచేయడం లేదు.. కేటీఆర్ మోహంలో వికృతానందం, అహంకారం కొట్టొచ్చినట్లు కనిస్తున్నాయి. కళ్లలో ద్వేషం, ఒంటి నిండా ఉక్రోషంతో ఊగిపోతు నోటికొచ్చిన సొల్లు వాగుడు వాగుతున్నాడు.. స్కిల్ యూనివర్సిటీ కి అదానీ ఇచ్చిన వంద కోట్ల చెక్ ను వెనక్కి ఇస్తున్నట్లు సీఎం ప్రకటించిన తర్వాత కూడా కేటీఆర్ మొరుగుతూనే ఉన్నాడుఅదానీ నుంచి చెక్ రూపంలో ,బహిరంగం గా మా ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ కోసం సీఎస్ఎఆర్ ఫండ్స్ తీసుకుంది..వివాదాలకు దూరంగా ఉండాలని అదానీ ఇచ్చిన చెక్ ను మా ముఖ్యమంత్రి వెనక్కి పంపించారు. అయినా కేటీఆర్ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడు.. పాడిన పాటే మళ్ళీ పాడుతున్నాడు. స్కిల్ యూనివర్సిటీ కి నిధులు రాకుండా చేయడమే కేటీఆర్ అసలు ఉద్దేశం. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు అయితే రేవంత్ రెడ్డి కి ఎక్కడ పేరు వస్తుందోనన్న అక్కసు తో అదానీ ని అడ్డం పెట్టుకొని చిల్లర వాగుడు వాగుతున్నాడు..

పదేళ్ల పాటు అదానీతో అంటకాగి, అడ్డగోలుగా ఒప్పందాలు చేసుకొని ఇప్పుడు సుద్దపూస కబుర్లు చెపుతున్నాడు..అదానికి చెందిన ప్రత్యేక విమానాల్లో తిరిగిన రోజులు కేటీఆర్ మరిచిపోయినట్లున్నాడు.. బీఆర్ఎస్ పరిస్థితి ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లు గా ఉంది. కేటీఆర్ కు మతి భ్రమించింది.. ఎర్రగడ్డ ఆస్పత్రికి వెళ్లి చూపించుకోవాలి..మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ కి వీర విధేయుడు..రాహుల్ గాంధీ మాట మా రేవంత్ రెడ్డి కి శిలా శాసనం..రాహుల్ గీసిన గీత ను మా రేవంత్ రెడ్డి దాటడు..అధిష్టానం మాటే మా ముఖ్యమంత్రి మాట.. మా అందరి బాట.తెలంగాణ మహిళల కోసం అనేక సంక్షేమాలను అమలు చేస్తున్నాం..బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కుల గణన చేస్తున్నాం. తెలంగాణ లో కులగణన దేశానికి రోల్ మోడల్ గా ఉంది. మా సీఎం రేవంత్ రెడ్డి పైన చౌకబారు విమర్శలు చేస్తే ఖబడ్దార్.

కేసుల దర్యాప్తులో సమస్యలు అధికమించేందుకు

రాజమండ్రి, నవంబర్ 26 (వాయిస్ టుడే ప్రతినిధి): నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులో తలెత్తుతున్న సమస్యలను అధిగమించేందుకు ఇద్దరు అడిషనల్ పీ.పీ లు మరియు ఆరుగురు ఏ.పీ.పీ ల తో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ జిల్లా పోలీసు అధికారులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా పోలీసు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు అరెస్టులు, దర్యాప్తు, ఛార్జ్ షీట్ల దాఖలు, ట్రయల్స్ మొదలైన వాటికి సంబంధించి తరచుగా ఎదుర్కొంటున్న సమస్యలను గురించి ఉన్న సందేహాలను, అలాగే పరిష్కారాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ పి.పి రాధాకృష్ణ రాజు, లక్ష్మ నాయక్,అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) అల్లూరు వెంకట సుబ్బరాజు, అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్.బి.ఎం మురళీకృష్ణ , ఆరుగురు ఏ.పీ.పీ లు, జోనల్ డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.